ముక్కాలుపీట

రాత్రి హోటలుడాబామీద కూచుని నలుగురు సేట్లూ బెజవాడ పడమటి కొండలకేసి చూస్తున్నారు. ఎనిమిదైనా ఇంకా ఓలేత కాంతి కొండమధ్యనించి బెజవాడమీదికి చాచుకునే వుందనిపిస్తోంది. రైలుస్టేషన్ ఎర్రపచ్చ దీపాలూ తరువాత క్రమంగా ఎత్తవుతూ కొండమీదికి పాకే దీపాలవరసా చూస్తున్నారు ఎంత అందమూ అని. కృష్ణవంతెనమీది నించి రైలువస్తో, తెల్లనిచారని ముందుకు నెట్టుకుని వేసుక్కుంటోంది తోవ. వాళ్ళని భోజనానికి రమ్మన్న ఇన్‌స్పెక్టర్ రామరాజు అరగంట ఆలస్యంగా వొచ్చాడు.

"ఏమిటి ఆలస్యం" అన్నాడు, బాంబేనించి ఇద్దరు తోడిసేట్లని వెంటపెట్టుకు వొచ్చిన సింహాచలం.

"పోలీసు ఉద్యోగం. ఇవాళ..."

"ఎన్నిసార్లు చెప్పాలి. ఈపాడు పోలీసుఉద్యోగం నీ కెందుకని? నా కర్మాగారంలో చిన్న మానేజరుకి అయిదు వందల రూపాయల జీతం.

"ఇతనిని నా Partner గా కూడా తీసుకుంటాను రమ్మన్నాను. ఇంతకంటె fool వుంటాడా?" అన్నాడు ఆ ఇద్దరు సేట్లతో సింహాచలం.

"కాని, డబ్బు సంపాదనలో ఈ ఉద్యోగములో వొచ్చే త్రిల్ వుంటుందా?" అన్నాడు రాజు.

"లేకేం? డబ్బు సంపాయించడాన్ని మించిన థ్రిల్ లోకంలో లేదు. డబ్బేకాదు. కొత్తమార్కెట్లు, తక్కిన కంపెనీలతో పోటీ!" అన్నాడు సింహాచలం.

"నీ కొడుక్కి థ్రిల్, వేలమందికి వుత్త బండచాకిరీ, నీ కర్మాగారంలో."

"వాళ్ళకిమాత్రం? నువ్వు పట్టుకునే దొంగలకి నిన్ను తప్పించుకునే థ్రిల్ లేదంటావా?"

"వుందేమోలే. దొంగలకి భయం, కార్మికులకి దరిద్రం."

"అందుకనే పరిశ్రమలు జాతీయం చెయ్యడం చాలా మూర్ఖమంటాను!" అన్నాడు ఒక సేఠ్ అసందర్భంగా.

"రష్యా సంగతేమిటి?"

"రష్యాఐనా అంతే. ప్రస్తుతం ఏవేవో ప్రయత్నాలూ, కలలూ, ఎంతకాలం? అదిగాక యుద్ధాలు వొస్తాయని థ్రిల్, అవిపోనీ, జీవితంలో ఇన్‌టరెస్టు పోతుంది."

"సరేకాని, నీ ఆలస్యానికి ఏదో కారణం చెబుతున్నావు?"

"అవును, మనవూరు కొత్తరైల్వే ఇంజనీరు లేడూ దొరస్వామి, అకాత్తుగా మధ్యాన్నం ఆతనిగదిలోకి ఒకామె వొచ్చింది. ఎవరో తెలుసా? రాజగోపాలాచారి కోడలు. వొచ్చీ రావడంతో కుర్చీలో కూచున్న అతనిమెడను కావిలించుకుని ముద్దుపెట్టుకుంది. దొరసామి అందమైనవాడు. అతన్ని మొన్న తులాభారం నాటకంలో చూసిందట.

మొగుడు ఆమెని మొగాళ్ళల్లోనే కూచోపెట్టుకుంటాడుగా! పైగా తన సొంత కారులో తనే డ్రైవ్ చేసుకొంటూ వెళ్ళిందట ఆఫీసుకి. హడలిపోయినాడు అతను. బల్లకీ కుర్చీకీ మధ్య దూరి అతని వొళ్ళోకూచుని మెడచుట్టూ చేతులేసి ముద్దులాడుతోంది. అతనికి ఎదురుగా పెద్దకిటికీలోంచి గుమాస్తాలు కనపడుతున్నారు ఇదంతా చూస్తో. అతను లేచి, వొచ్చీరాని తెలుగులో 'ఎవరు? ఎవరు?' అని అరిచాడు."

"నువ్వు నా భర్తవి. నువ్వే అసలు భర్తవి. నాకు దేవి చెప్పింది. నీ భార్యని పంపించెయ్. ఆఫీసు ఐపోగానే మన ఇంటికి పోదాం" అంది.

"పిచ్చిదా! అదేమన్నా వేషమా? మోసమా? పాపం అతను గుమాస్తాల్నీ బంట్రోతుల్నీ పిలిచి ఏమిటో కనుక్కో-మన్నాడు. వాళ్ళతోనూ అదేమాట. వాళ్ళు ఆమెని గుర్తించి భర్తకోసం పరుగెత్తారు." అని ఆగాడు రామరాజు.

"అటు వెడుతున్న Prof: జగన్నాయకులు వాళ్ళని చూసి దగ్గిరికి వొచ్చి నుంచున్నాడు.

"రాజగోపాలాచారి కోడలు సంగతేనా? చాలా చిత్రం" అన్నాడు జగన్నాయకులు.

"ఆ భర్త వొచ్చేలోపల చాలా అల్లరిచేసింది ఆమె! తన జాకెట్టు తీసెయ్యడం, అతనికోటు లాగెయ్యడం ఇట్లాంటివి. ఇంక ఆమె ప్రేమప్రదర్శనం, మోహం చూసితీరవలసిందేట."

"ఆమె అందంగా ఉంటుందా? యవ్వనవతా?" అన్నాడు ఒకసేటు.

"చాలా"

"అందరిలో ఆఫీసులో జరిగిందిగాని వొంటరిగా జరిగితే ఈ గొడవే లేకపోను. అ ఇంజనీరు తెలివిగలవాడైతే చల్లగా జాగ్రత్తగా ఏర్పాట్లు చేసుకునేవాడే" అన్నాడు రెండో సేటు.

"మీ కా అదృష్టం రాకపోయిందనే దిగులా?"

"నిస్సందేహంగా, నేనైతేనా ఆఫీసులోనైనాసరే, చాలా చక్కగా manage చేసేవాణ్ణి."

"తరువాత?"

"భర్త వొచ్చాడు. వొస్తే ఆమెచాలా స్పష్టంగా శుభ్రంగా మాట్లాడింది. 'ఇంక మీకూ నాకూ సంబంధం లేదు మీరు నాకు భర్తేమిటి? వేరే పెళ్ళిచేసుకోండి. ఇంక ఈయనతో నేను చాలా గొప్పస్వర్గం అనుభవించబోతున్నా'నని. లా క్కేశ్వరు కారులో పడేసి ఆమెని భర్తా వాళ్ళూ. రేపణ్ణించి ఏమవుతుందో చూడాలి."

"ఆమె ఇదివరకంతా మామూలుగానే వుండేదా?"

"మళ్ళీ యింటికి వెళ్ళింతరవాత మామూలుగానే వుంది. అక్కణ్ణించే వొస్తున్నాను, డాక్టరుతో మాట్లాడుతూ వుండిపోయి."

"అందరూ ఏమంటున్నారు?"

"ఏమైతేనేం చాలా ఇన్ట్రెస్టింగా వుంది"

"ఆ మాత్రం ఏదో ఈవెన్టు జరక్కపోతే జీవితం చాలా డల్‌గా వుంటుంది."

"కొందరు మనుషులే ఈవేళ. నోరి వెంకటేశ్వర్లు బతికివుండవలసింది. ఈ వ్యవహారంమీద అతని కామెంట్సు వినడం ఒక ట్రీట్. అతను పోయింతరువాత మనవూరు ఎంత చిన్నపోయింది!"

"గోపాలరావు వెళ్ళిపోయిం తరవాతో!"

"నిజమే."

"ఈ సంగతిని గురించి మీ అభిప్రాయ మేమిటి?" అని అడిగారు మనోశాస్త్రవేత్తని జగన్నాయకుల్ని.

ఈ జగన్నాయకులు ఎట్లానూ వొదలడు, భోజనం పెట్టిందాకా అనుకున్నాడు రామరాజు.

"ఇది temporary mental aberation."

"ఏదన్నా గ్రహమేమో!"

"గ్రహాలూ, పూనడాలూ, దెయ్యాలూ అన్నీ అంతే."

"Sub-conscious disturbance."

"Stock theraphy అది. ఇదేమిటి? ఇంతకన్న చిత్రమైనది మొన్ననే జరిగింది చెబుతాను వినండి."

ఎట్లాగూ వొదలడు. భోజనం పెట్టిందాకా చెబుతోనే వుంటాడు. ఏంచేస్తాం? అనుకున్నాడు రామరాజు.

"గోవిందరాజులు కలకత్తానించి శెలవమీద సొంత వ్యవహారాలు చూసుకోడానికే తణుకు వచ్చాడు. అతని అన్నగారి ఇంటో అన్నకూతురు సులోచనన్ని చూసి.

"ఎప్పుడు వొచ్చింది అత్తవారింటినించి?" అని అడిగాడు.

సులోచనని శ్యామరావుకి ఇచ్చారు. అతను నెల్లూరులో గొప్పవకీలు. మొదటిభార్య ముప్పైఏళ్ళకేపోయింది. సులోచన తరువాత భార్య.

"అయ్యో! సులోచనకి అత్తవారిల్లు కూడాను" అని ఏడ్చింది అతని వొదినగారు.

"ఏమిట్రా అన్నయ్యా, శ్యామారావు పోయినాడా?"

"పోయినా పీడా వొదిలిపోను. శ్యామారావు సులోచనని తీసికెళ్ళాడు. అంతే ఏంలేదట. మొదటిభార్య దుర్గ ఫోటోని పెద్దదిచేయించి వేళ్ళాడకట్టాడు ఖద్దరు దారాలతో. ఈ రెండో పెళ్ళాం పని-పొద్దున్నే అతనితోకలిసి ఆ ఫోటోకి పూజలు చెయ్యడం, దణ్ణాలు పెట్టడం. ఇది ఎవరితో చెప్పుకుంటుంది? వీలైనప్పుడల్లా దుర్గని పొగిడి ఆమె ఆదర్శమని, ఆమెతో పోల్చి దీన్ని సిగ్గుపర్చడం. ఇప్పుడు ఆ దుర్గ ఓ దేవత. అన్ని సుగుణాలూ పాతివ్రత్యాలూ గొప్పదనాలూ అన్నీ ఆమెవే. పొద్దస్తమానం వొడకాలి. ఎందుకంటే, దుర్గ ఖద్దరు ధరించేది. ఆ దుర్గ సంగతి మన కెవరికీ ఏమీ తెలీనట్లు. ఓసారి పండక్కి వొచ్చినప్పుడు సులోచన ఏడ్చింది. నేనువెళ్ళి అతన్నే ప్రశ్నించాను. ఈ విషయంలో మాత్రం మనమనిషి కాడు అతను. తక్కిందంతా బుద్ధిమంతుడూ స్వార్థపరుడూ. తనెట్లా బాగుపడాలో బాగా తెలుసు. మంత్రి అయ్యే ఛాన్సుకూడా వుంది. అడిగితే "నా మొదటి భార్య కలవుకాలే దంటాడు. దేనికి? రెండోభార్యతో కాపరానికి. ఏంమాట్లాడినా అదేమాట?"

"చాలా చిత్రంగావుందే. వుండు, నేను మద్రాసు వెళ్ళేప్పుడు దిగి కనుక్కుంటాను. వాడు నేనూ కలిసి చదువు కున్నాంకదూ ?" అన్నాడు గోవిందరాజులు.

భోజనం దగ్గర సులోచనను పరిహాసమాడాడు, సవితి ఫోటో పూజసంగతి.

"చిన్నాన్నా ! నాన్న చెప్పినకారణం ముఖ్యమను కోకు. అదిసరేలే. ఆ పూజలూ, ఆ దుర్గమహాత్మ్యాలూ, పాతి వ్రత్యాలూ, ఆదర్శాలూ, ఆ ఉపన్యాసాలు వింటోవుంటే ఆ ఫోటోని కిందికిలాగి, బద్దలుకొట్టి ఆయన నెత్తిమీద విసిరి కొట్టాలనిపిస్తుందనుకో. ఏంచేసినా ఆ ఇంటో నిలవడం కష్టం."

సులోచన అందమైనది; చదువుకున్నది, తెలివయింది.

"సరేలే నేను వెళ్ళి మాట్లాడి వొస్తానుకదూ ?"

"మాట్టాడితే మాట్లాడులే. కాని నే నక్కడికి కాప రానికి వెళ్ళేది వుత్తది."

"అదేమిటి ?"

"అంతేలే. 'అదేమిటి ?' అంటావు. నీకేం ? అందు కనే మొగవాళ్ళకి ఇంతబుద్ధి లేదేమో అనుకుంటాము. అవేవో షరతులు పెడతావు. వొప్పిస్తావు. కాని ఆ మనిషి. ఆ మనసూ ? అదేం చేస్తావు ? ఒకపిచ్చి అనుకో. ఓ ముక్కాలుపీట పెట్టారు. దాంటోంచి ఆమెరోజూ సందే శాలు పంపుతుంది. ఆ ప్రకారం జరిగించి తీరాలి. ఓరోజు 'ఈరాత్రి మేలుకొనుచో' అంటుంది. ఆ మాటతో ఇంటి

ఎవరికీ నిద్రవుండదు. ఓరోజు 'కాబూలు ఆపిల్సు కావాలి' అంటుంది. ఇంక కొన్నివారాలు వాటికోసం ప్రయత్నం. 'సులోచనని కొప్పుపెట్టి పసుపు పూసుకుని, సిలంఖద్దరుచీర కట్టుకుని కనపడమను' అంటుంది. ఓరోజు 'దిసిమొలగా కూచోమను' అంది. అంతే, ఆ ఆజ్ఞ కూడా పాలించవలసిందే.

"బావుంది."

శ్యామారావు బుద్ధిహీనుడు కాడు. తనేమో డబ్బు సంపాదనలోవుండి భార్య దుర్గని స్వదేశోద్యమంలో ప్రవేశ పెట్టాడు. ఎటువచ్చినా నష్టపడకుండా వుండడానికి. ఆమె రెండుసార్లు జైలుకు వెళ్ళింది. ఆటుతరవాత తిరగడం రుచి మరిగి ఇల్లు పట్టకుండా ఉద్యమంలో పనిచేసింది. ఇంకేం అందమైన ఆడ ఆమెకి రావలసిన అపవాదుల్లో నిజంవాటిలో బోలెడు వొచ్చాయి. చివరియిద్దరు పిల్లలకీ శ్యామారావు పోలికలే లేవు. ఈనాటి ప్రసిద్ధనాయకుల ఇద్దరిపోలికలు అచ్చుగుద్ది వున్నాయి మరి. పాపం పుణ్యం భగవంతుడికి తెలియాలి. ఎట్లాఅయితేనేం, ఆమెకి జబ్బుచేసింది. జైలు వల్లా ఉద్యమ ఉష్ణతవల్లా ఆరోగ్యం బలిఅయిందన్నారు. ఆమాట నిజమే. ఉద్యమంలో వాళ్ళవల్ల పట్టుకున్న రోగాలే అవి. చివరికి చచ్చిపోయింది. చచ్చిపోతుండగానే శ్యామారావు ఆమెకి చాలాఫొటోలు తీయించాడు. దహన సంస్కారానికి గొప్ప ఊరేగింపు జరుగుతుంది రమ్మని నాయకులకి టెలిగ్రాము లిప్పించాడు. పత్రికల్లో ఫొటోలతోసహా ప్రకటించాడు. చచ్చిపోయినాక అందర మతాలవాళ్ళచేతా ప్రార్థనలు చేయించి అస్థులకి పూలచందాలమీద గొప్ప

సమాధి కట్టించాడు చలవరాతితో. ఆ తరవాత నాయకుల అభిప్రాయాలు తీసుకొని ప్రతి పత్రికలో ప్రకటించాడు. కవుల్ని బతిమాలి డబ్బుపెట్టి పద్యాలు రాయించి పుస్తకం వేయించాడు. దేశంమీద చందాలు వేయించి, ఆమె పేర ఒక నేషనల్ పాఠశాలా, ఒక ఆయుర్వేద ఆస్పత్రీ పెట్టించాడు. అంతవరకు తెలుసు చరిత్ర గోవిందరాజులకి. ఇప్పుడు ఈ కొత్త విశేషం. మధ్య మధ్య బంధువులకీ నాయకులకి ఉత్తరాలు వెడుతోవుంటాయి-దుర్గాదేవి సందేశం అని పైన రాసి.

"ఈ వారంలో గవర్నరు జనరలుతో రాయబారం పెడితే అనుకూలిస్తుంది." దుర్గాదేవి-ఆజ్ఞ.

"మీ అబ్బాయి జరం త్వరలో నయంగా వుంటుంది." దుర్గాదేవి ఆజ్ఞ.

"మీ భార్య రహస్యంగా వ్యభిచరిస్తోంది." దుర్గాదేవి ఆజ్ఞ.

"అష్టమినాడు ఉత్తరాన తుమ్మచెట్టుకి మేకుకొడితే మీకు అదృష్టం" దుర్గాదేవి ఆజ్ఞ.

"మంత్రివర్గం వెంటనే రాజీనామా చెయ్యాండి" దుర్గాదేవి ఆజ్ఞ.

"అర్జెంటీనా సహాయం అభ్యర్థించండి" దుర్గాదేవి ఆజ్ఞ."

ఇట్లాంటి ఉత్తరాలు రోజూరోజూ దశదిసలకి వెడుతో వుంటాయి. ఇంగ్లీషు గవర్నర్లకి కూడా వెళ్ళేవి.

"పందిమాంసం తినడం మానెయ్యండి" దుర్గాదేవి ఆజ్ఞ.

"మీరు మెసిపిటోమియానించి లేచిపొండి." దుర్గాదేవి ఆజ్ఞ.

"సైన్యాధిపతిని బదిలీచెయ్యండి" దుర్గాదేవి ఆజ్ఞ.

"రామ్మోహన్ పెద్దనాల్గు కూతుర్ని హైదరాబాదు నవాబు బావమరిదికిచ్చి పెళ్ళిచెయ్యండి." దుర్గాదేవి ఆజ్ఞ.

గోవిందరాజులు మద్రాసు వెడుతూవుండగా రైల్లో కోసలరావు కనపడ్డాడు. అంతకన్న కావలసిందేమని కోసలరావుతో శ్యామారావు ప్రస్తావన తెచ్చాడు గోవిందరాజులు. "శ్యామారావు పని చాలా ఆశ్చర్యం. చచ్చిన భార్యని తన ఘనతకి బాగా ఉపయోగించుకున్నాడు. కాని ఇప్పుడు ఆ భార్య దెయ్యమై అతన్ని లొంగతీసుకుంది. ఆ ముక్కాలుపీట వ్యవహారం చాలా సీరియస్‌గా సిన్సియర్‌గా నమ్ముతున్నాడు తెలుసా! అతనుపంపే ఆ సందేశాలు అన్నీ చాలా వాస్తవమైనవని" అన్నాడు కోసలరావు.

"నిజంగా ఆ లోకంనించి వొస్తున్నాయంటావా!"

"ఏ లోకంనించి వొస్తున్నాయో, ఈ లోకంనించే వొస్తున్నాయో! అతనికి నిజంగా వొస్తున్నాయి. అతను నిజమని నమ్ముతున్నాడు."

"సరేలే. కాని పర్యవసానం చూడు."

వుండు. నువ్వు వెళ్ళు. నేనో తమాషా చేస్తాను. దాంతో ఈ పిచ్చి కుదిరిపోతుంది. నువ్వు వెడుతున్నావుగా.

ఒక్క వారంరోజులు అక్కడే అతని ఇంటోనేవుండు ఏం జరిగినా చూస్తోవూరుకో."

"నువ్వు చెయ్యిచేసుకుంటే అపజయం ఎందుకుం టుంది ?"

గోవిందరాజులు వెళ్ళేప్పటికి, శ్యామారావు ఇల్లంతా దెయ్యాలు తాండవిస్తున్నాయి. ఆ ఇంటో బతికినవాళ్ళ కన్న చచ్చినవాళ్ళెక్కువగా తిరుగుతున్నారు. ఒక్కగంట నిలవడం కష్టమనిపించింది. కాని తప్పదుగా! గోవిందరాజులు వూరికే స్నేహంగా మాట్లాడి వూరుకున్నాడు. ఏ వ్యవహారం ఎత్తలేదు. మొదటిరోజే ముక్కాలుపీటని అడిగాడు గోవిందరాజులకి సందేశం ఇమ్మని. "పెన్నలో మునిగి వెంటనే చావమనండి" అని వొచ్చింది ఆజ్ఞ.

మూడోనాడు పొద్దున్న ఒక యురపియన్ ఆమె వొచ్చింది శ్యామారావుకోసం. ఆమె పేరు మేడెం జూలియా. ఆమె విఖ్యాత "మీడియం" ఆమెద్వారాచచ్చిన యూరపు ప్రాముఖ్యులు, పరలోకాల రహస్యాలుఎన్నో వెల్లడిచేశారు. ఈ లోకపు స్పిరిట్యుయలిస్టులకి. ఇండియాదేశంలో పరలోక సంబంధాలు ఎక్కువగా ఉన్నాయని విని, వాటిని ఆమె తెలుసుకోడానికి వొచ్చింది ఇండియాకి. ఎవరో మద్రాసులో శ్యామారావుపేరు చెప్పారు. అందుకని వొచ్చింది నెల్లూరు.

శ్యామారావు ఉబ్బిపోయినాడు. ప్రతిరాత్రీ తన ముక్కాలుపీట మీటింగులకిరమ్మని ఆమెని ఆహ్వానించాడు. తనకి ఇన్టర్నేషనల్ Fame వొచ్చిందని సంతోషించాడు.

రాత్రి శ్యామారావు ఇంటో చాలామంది చేరుతో వుంటారు. కొందరు ముక్కాలు బల్లలో నిజంగా ఇన్టరెస్టు వున్నవాళ్లూ, కొందరు పొద్దుపోవడానికీ. ఆరాత్రి ముక్కాలు బల్లనించి సందేశాలు రాసుకుంటోవుండగా మేడెం జూలియా అకస్మాత్తుగా గుడ్లు తేలేసింది. మనిషంతా వొణికింది, ఇట్లా ప్రారంభించింది మాటలు:

"నేను, నేను, ఇన్నాళ్ళూ మీ ముక్కాలు బల్లని కదిపే నేను దుర్గని కాదు. నేను సూరమ్మని. మీ అక్కని. దుర్గ నరకంలో వుంది-దుర్గని ఇట్లా స్వేచ్ఛగా రానీరు. ఇన్నాళ్లూ దుర్గనని నటించి మిమ్మల్ని మోసంచేశాను. ఇవాళ నా మోసాన్ని కనిపెట్టగలిగిన శక్తిగల ఆమెవొచ్చి నన్ను బయట పెట్టింది. అన్నయ్యా, నువ్వు దుర్గను నమ్మావు. చాలాగొప్ప పతివ్రత అని ప్రపంచానికి చాటావు. నువ్వు దుర్గపేరుని నీ ఘనతకి ఉపయోగించుకుంటున్నావు. నువ్వు నీచమానవుడివి. కాని నీమీది ప్రేమవల్ల నేను దుర్గ రూపంలో నీకు నచ్చేట్టు నాటకం ఆడాను, నిజం చెపితే కృశించిపోతావని. కాని ఇవాళ నాకన్న గొప్ప శక్తితో ఈమె నన్నిడ్చుకొచ్చి నాచేత నిజంమాట్లాడిస్తోంది. దుర్గ వుత్త జారిణి. వొక్కరితో కాదు, తన స్నేహితులతో, నీ స్నేహితులతో, అడగనివారిది పాపం. నీకూ తెలుసు లోపల. కాని నువ్వు కళ్లు తెరవ తలుచుకోలేదు. నవ్వుల పాలవుతావనీ నీకు కీర్తినీ గొప్పతనాన్ని సంపాయించి పెడు తోందనీ. దుర్గ నరకానికి వెళ్ళింది. నిన్న వెళ్ళి చూశాను. దుర్గని, నీతో ఈ మాటలు చెప్పమంది. అంత అనుభ

వించినా తనకి మొగవాళ్ళమీద కోర్కె పోలేదట. తన శరీరం ఇంకా కామతృప్తి కావాలంటోందిట. ఆ తృప్తి తీరనంతకాలం, ఆ వాంఛ తీరనసంతకాలం తనకి నరకం లోంచి విముక్తిలేదట. ఆతృప్తి నీవల్లనే రావాలి. మరి భర్తవుకదా! మాలోకవాసులకి పుత్రులవల్లా, భర్తలవల్లనే సహాయం జరుగుతుంది. ఇంకెవరూ పనికిరారు. కనక నిన్ను వెంటనే ఓస్త్రీని సౌఖ్యపెట్టమంది. నువ్వు అనుభవించే స్త్రీని ఆవహించి తాను తృప్తిపడుతుందిట. అదే దుర్గ కడసారికోరిక. ఇంక నాపని అయిపోయింది. నేను వేరే జన్మకి వెళ్ళిపోతున్నాను. ఇంకరాను" అని చెప్పి, మేడం జూలియా వెనక్కి విరుచుకు పడిపోయింది. శ్యామలరావు నోటమాటరాలేదు. సభాసదులు చెల్లాచెదురైనారు.

మర్నాడు మేడం జూలియా ఎక్కడా కనిపించలేదు. శ్యామారావు మూణ్ణాల్లు మంచంపట్టాడు. అంతటితో అతనికి ముక్కాలుపీట పిచ్చి వొదిలింది. దుర్గ నామ ప్రచారం మానేశాడు. సలక్షణంగా ప్లీడరీ చేసుకుంటూ, బాగా సంపాయిస్తూ కాపరం చేస్తున్నాడు—తనని అస్పత్రిలో దయగా చూసిన నర్సు నరసమ్మతో.

కోసలరావు గోవిందరాజులకి రెండువందల యాభై రూపాయలకి బిల్లు పంపాడు. బిల్లు చెల్లించుకుంటూ గోవింద రాజులు కలకత్తాలో కోసలరావుతో—

"మరి ఏం జరిగినట్టు? సులోచనకి ఏం ఉపకారం జరిగింది?" అన్నాడు.

"సులోచనకి వాడేమిటి? తండ్రికి బుద్ధిలేక పెళ్ళి చేస్తే నాకు బుద్ధిలేదూ! సులోచనసంగతి నేను చూస్తాలే, 'దైవద్రుసుబిల్లు' ప్రవేశపెట్టించాను మన కాళేశ్వర్రావుచేత" అన్నాడు.

"మరి ఈ గలభా అంతా ఎందుకు చేయించావు? శ్యామారావు ఏమైతే మనకేం!".

"సైకలాజికల్ ఇన్టరెస్టు"

"నాఖర్మ్చతో" అని మూలిగాడు గోవిందరాజులు.

—•••—